## క్లుప్తంగా

### ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పుష్పపల్లకిలో విహరిస్తున్న అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మకు కనుమ పండుగ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు ఉభయదారులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అమ్మవారిని పుష్పపల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

### వసతులపై శ్రద్ధ పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం: మండలంలో పోలింగ్ జరగనున్న కేంద్రాల్లోని వసతులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ జరిగే కేంద్రా ల్లో మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక నిఘాపెట్టాలని ఆదేశించారు. మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పుత్తూరు మండలం కొత్తతిమ్మాపురం గ్రామానికి చెందిన దాతలు బుధవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేశారు.

### ఎంజీఆర్‌కు నివాళి



ఎంజీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఏఐఏడీఎంకే నాయకులు

నగరి : దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ 107వ జయంతిని బుధవారం నగరి మున్సిపల్ పరిధిలో ఏఐఏడీఎంకే ఆంధ్రరాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, సత్రవాడ, కేవీపీఆర్‌పేట ప్రాంతాల్లో ఎంజీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ బృందా కన్నాయిరం, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గ సెక్రటరీలు గోవిందస్వామి, పాండు, కేసీ షణ్ముగం, నాయకులు కైలాసం, బీఆర్వీ అయ్యప్పన్, నటరాజన్, మోహన్‌రాజ్, మనోహర్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్‌బాయ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, పచ్చడి, సాంబారు, రసం, పెరుగన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్ నారాయణస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రంగవల్లుల సంక్రాంతులు

ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతులు అందుకున్న వారితో మంత్రి ఆర్కే రోజా



- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అట్టహాసంగా ముగ్గుల పోటీలు
- అందమైన రంగవల్లులు వేసి ఆకట్టుకున్న మహిళలు
- సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టిన పండుగ సంబరాలు
- విజేతలకు బహుమతులు అందించిన మంత్రి రోజా

నగరి : పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడతాయని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి, కొండచుట్టు ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా మైదానం మొత్తం రంగవల్లులతో శోభాయమానంగా కనిపించింది. రంగవల్లులు సంక్రాంతి పండుగకు నూతన హంగులను చేకూర్చాయి. ముగ్గులు వేసే ప్రాంగణమంతా మావిడాకుల తోరణాలు, అరటిచెట్లు, చెరకుగడలు, పొంగళి కుండలతో సంక్రాంతి కళ ఉట్టిపడింది. నియోజకవర్గ వ్యాప్తంగా 783 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారుల కోలాటం, డూడూబసవన్న, మట్టి గాజులు, మెహందీలు, చిలకజోస్యం, సోదెమ్మలు, ఎడ్లబండ్లు, గాలిపటాలు, తెలుగింటి పిండివంటలు చూపిన మెప్మాబజార్ అన్నీ కలిసి కనుల ముంగిట పెద్దపండగను సాక్షాత్కరించాయి.

**విజేతలకు బహుమతులు..**

నియోజకవర్గస్థాయిలో 783 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొనడంతో ఇప్పటి వరకు నగరి పట్టణంలో ఇవే అతిపెద్ద పోటీలుగా నిలిచాయి. మహిళలు పోటీపడి వేసిన రంగవల్లులు పలువురిని అలరించాయి. ప్రభుత్వ పథకాలను కూడా మహిళలు ముగ్గుల రూపంలో చిత్రీకరించారు. పోటీలో ప్రథమ బహుమతిగా ఎల్‌ఈడీ టీవీ, ద్వితీయ బహుమతిగా వాషింగ్ మిషన్, తృతీయ బహుమతిగా కుట్టుమిషను, 10 మందికి ప్రోత్సాహక బహుమతులుగా స్టాండింగ్ ఫ్యాన్లను అందించారు. విజేతలతో పాటు ముగ్గులు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రెషర్ కుక్కర్లను మంత్రి భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి అందించారు. పోటీలను తిలకించేందుకు విచ్చేసిన మహిళలు మెహందీలు పెట్టుకోవడం, చిలకజోస్యం చెప్పించుకోవడం, గాజులు తొడుక్కోవడం తదితర కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. ఈ పోటీలకు నగరి, విజయపురం ఎంపీడీఓలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, ఎంపీపీలు భార్గవి, దీప, మునివేలు మున్సిపల్ వైస్‌చైర్మన్లు వెంకటరత్నం, జయప్రకాష్, వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, ఆలయ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి రోజా దంపతులు







అలరించిన ముగ్గులు

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దుర్గ కుటుంబం

కాణిపాకం(యాదమరి): శ్రీశైలంకు చెందిన దుర్గ బుధవారం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆమె కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరం తనిఖీ



క్యాంపును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్: ప్రభుత్వం ఆశయం మేరకు వైద్యులు బాధ్యతతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని డీఎంఅండ్‌హెచ్ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని మాపాక్షిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్యసేవలపై ఆరా తీశారు. క్యాంపు వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు షణ్ముఖ, సిబ్బంది పాల్గొన్నారు.

### యాగ మహోత్సవం

చంద్రగిరి: శ్రీవారి మెట్టు శ్రీభక్తాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద గురువారం మరాఠీలు శ్రీరామ్ కథా జ్ఞాన యాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకుని, అక్కడ జరుగుతున్న మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలిరండి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు పిలుపు



నల్లాని బాబు

తిరుపతి మంగళం: విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల స్మృతివనం ప్రారంభోత్సవానికి తిరుపతి జిల్లా నుంచి ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ పాలనలో అంటరానివాళ్లుగా చూస్తున్న దళితులకు సమాజంలో సముచిత స్థానం కల్పిస్తూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లలో దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదిగారంటే అది కేవలం జగనన్న పాలనలో మాత్రమేనన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో దళితులకు ఇన్ని ఉన్నత పదవులు కల్పించిన దాఖలాలే లేవన్నారు. 19న ప్రారంభించనున్న 206 అడుగుల అంబేడ్కర్ స్మృతివనం దళితుల అభ్యున్నతికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. దళితులు సీఎం జగనన్నకు జీవితకాలం రుణపడి ఉంటామని చెప్పారు.

### స్విమ్స్‌కు వీల్ చైర్లు వితరణ



వీల్ చైర్లను స్వీకరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రికి రూ.50 వేలు విలువచేసే వీల్ చైర్లను వితరణగా అందజేశారు. ఈ మేరకు దాతలు బుధవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌కు 10 వీల్ చైర్లను అందించారు. స్విమ్స్‌లో 30 ఏళ్ల పాటు ఏఎన్‌ఎంగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన ఎం.సుధారాణి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వాటిని అందించారు. దాతలు పార్థు, తనూజతో పాటు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

### కోడిపందెం రాయుళ్ల అరెస్టు



కోడి పందెంరాయుళ్లతో పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, తిమ్మభూపాలపురం గ్రామాల సమీపంలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి నాలుగు కోళ్లు, రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో కోడి పందేలు ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానిస్టేబుళ్లు ప్రభాకర్, అరుణ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోవిందుడి పార్వేట ఉత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి, అమ్మవారికి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6.30 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.



పార్వేట ఉత్సవంలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారు

### ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీ కేపీమిట్టకు చెందిన పోలయ్య(75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం విషపు ఆకు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయనను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

### నిత్యాన్నదాన సత్రం పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రాన్ని బుధవారం ఈవో కేఎస్ రామారావు పరిశీలించారు. కూరగాయలు, బియ్యం, సరుకుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అనంతరం భోజనం నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.

### రికార్డుల తనిఖీ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పలు విభాగాలకు చెందిన రికార్డులను ఈవో కేఎస్ రామారావు తనిఖీ చేశారు. ఆలయంలోని పీఆర్వో కార్యాలయం, ఇంజనీరింగ్ విభాగం ఇతర ప్రధాన కార్యాలయాల్లోని విభాగాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## కపిలతీర్థంలో కారిడార్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న కపిలతీర్థం పురోహిత సేవాసంఘం గౌరవ సలహాదారుడు రాజేష్

- శ్రీకపిలేశ్వర పురోహిత సేవా సంఘం నేతల విజ్ఞప్తి

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో శాశ్వత పురోహితం నిర్వహణ కోసం కారిడార్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని శ్రీకపిలతీర్థం పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్, అధ్యక్షుడు ఎ.అనిల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15వ తేదీన కపిలతీర్థంలో పితృదర్పణ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేక షెడ్లు వేయడంతో పాటు ఏర్పాట్లు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఫారెస్ట్ అధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కపిలతీర్థం వేదికగా పురోహితమే జీవనంగా సంఘ సభ్యులు సుమారు 200 మంది బతుకుతున్నట్లు చెప్పారు. తమకు పురోహితం నిర్వహణ కోసం కపిలతీర్థం వద్ద స్థలం కేటాయించి కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల జరిగిన పితృదర్పణ కార్యక్రమాల సందర్భంగా బయట వ్యక్తులు కొందరు ప్రజలకు పితృదర్పణ గడియలపై తప్పుడు ప్రచారం చేసి తమకంటే ముందుగా కపిలతీర్థం చేరుకుని స్థలాలు ఆక్రమించి పురోహితం చేపట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వాపోయారు. కపిలతీర్థంలో పురోహిత వృత్తి చేసుకునే తమ సంఘం వారికి టీటీడీ గుర్తింపు కార్డులు ఇచ్చి వివాదాలకు చోటు లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పోగొట్టుకున్న నగదు అప్పగింత



పర్సుతో పాటు నగదును భక్తురాలికి అప్పగిస్తున్న ఆలయ అధికారులు

చంద్రగిరి: స్వామివారి దర్శనానికి వచ్చి పర్సు పోగొట్టుకున్న మహిళలకు టీటీడీ అధికారులు తిరిగి అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పాండిచ్చేరికి చెందిన పాచ్చానమ్మ అనే మహిళ గురువారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చింది. స్వామివారి దర్శనానంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో తన పర్సును పోగొట్టుకుంది. దీంతో ఆలయ అధికారులు సమాచారం ఇవ్వడంతో అధికారులు సీసీ పుటేజీ ద్వారా పర్సును గుర్తించారు. అనంతరం పర్సుతో పాటు రూ.6 వేల నగదును అధికారులు భక్తురాలికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగల్రాయులు, జమేదారు చిరంజీవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



ఉద్యోగులను సన్మానిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

- ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు–2 డిపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ మనుగడ ఉద్యోగులపై ఆధారపడి ఉందన్నారు. బస్సులు నడపడంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నష్టాలను అధిగమించేందుక ప్రణాళిక ప్రకారం బస్సులను తిప్పాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల జరగకుండా జాగ్రత్త పడాలని, ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం ఆయన ఆదర్శ డ్రైవర్లను సన్మానించారు. ముందుగా డిపో గ్యారేజీని తనిఖీ చేశారు. జిల్లాలో ఆర్టీసీ సమస్యలు, ప్రమాణికుల ఇబ్బందులు, బస్టాండు నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, సీఐ అల్తాఫ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: డీటీసీ**



రవాణాశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న డీటీసీ బసిరెడ్డి

చిత్తూరు రూరల్: రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా రవాణశాఖ కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. రోడ్డు భద్రత విషయమై డీటీసీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మానవ తప్పిదాలతోనే 90 శాతం ప్రమాదాలకు దారితీస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలిందన్నారు. మితిమీరిన వేగం, రోడ్డు నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నట్టు చెప్పారు. రహదారి మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనదారులు వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.